కథా నిలయం
శ్రీకాకుళం

# సహజీవనం

**పా**తికేళ్ళ అబ్బాయి ఒకతను ప్రక్క వాటాను అద్దెకు కుదుర్చుకున్నాడన్న వార్త చెవిని పడగానే నీలకంఠానికి ప్రాణం లేచి వచ్చినట్టయింది. తనకు రాజకీయాలు క్షుణ్ణంగా తెలుసు. సినిమా సంగతులు కొట్టిన పిండి. పోగా సాహిత్యంలో గూడా ప్రవేశం కద్దు! ఎటొచ్చీ ఇంట్లో తీరిగ్గా కూర్చున్నప్పుడు ఈ విషయాలను గురించి చర్చించుకోడానికి ఓ మనిషి లేకపోవడం తీరని లోటుగా వుంటూ వచ్చింది చాలా కాలం నుంచీ!

పార్వతితో తన అభిప్రాయాలను పంచుకోడం కంటే చెవిటి వాడి యెదుట శంఖు పట్టడమే నయమని నీలకంఠం ఏనాడో నిర్ధారించుకున్నాడు. ఫలానా సినిమా నటి బాగా నటిస్తుందని తనొక అభిప్రాయం వెల్లడిస్తే "అబ్బో, అవకాశముంటే అంతకన్నా బాగా నటించగలిగిన వాళ్ళెంతమంది లేరు! ఎవరి దాకానో ఎందుకూ, మన పొరుగింటి వెంకాయమ్మ పిన్నిలేదూ. నన్నడిగితే నటనలో ఆవిడే ఫస్టు. కావలిస్తే ఓ చిటిక కాఫీపొడుం కోసం వచ్చినప్పుడు చూడండి" అంటూ సవాలుకు సిద్ధపడే పార్వతితో చర్చ ఏం కొనసాగుతుంది?

ఇలాంటి తెలివి మీరిన ఘటాన్ని కట్టుకోవడం వల్లనే గదా, నాకు నేనైనా నోటికి బిట్ట పెట్టుకోవలసి వచ్చింది- అని నీలకంఠం లోలోపలే కాసేపు దురపిల్లేవాడు.

అది గుణమైతేనేమి, దోషమైతేనేమి పార్వతి స్వభావమే అంత. ఆమె ఎదుటి మనిషి ప్రసంగాన్ని శ్రద్ధగా వినడం, అందులోని వాదాన్ని పునాదుల్లో నుంచీ కూలదోయడానికేనన్న విషయం నీలకంఠానికి తెలిసినంత బాగా మరొకరికి తెలియదు.

ఇట్టి పరిస్థితిలో ఓ పాతికేళ్ళ యువకుడు ప్రక్క వాటాలో దిగిన కబురు నీలకంఠానికి కాస్త సంతృప్తిని చేకూర్చడం సహజమే. కానీ ఇంతలోనే ఒక సందేహం. ఇదేమో ఒక చిన్న సంసారం నివసించడానికి వీలున్న వాటా. మరి ఇతడేమో ఒంటరిగాడు. కొంపదీసి స్వయంపాకం చేసుకునే బాపతేమో! నీలకంఠానికి ఒక రకం మనుషులంటే బొత్తిగా

గిట్టదు. నిర్దిష్టంగా ఒక పేరంటూ లేదుగాని - వాళ్ళు డబ్బు ఆదాచేయడ మొకటే జీవిత లక్ష్యంగా ఎలాంటి నికృష్టమైన పనికైనా తెగబడే మనుషులు. వాళ్ళు హోటళ్ళకు వెళ్ళరు. సినిమాలు చూడరు. వార్తా పత్రికలు కొనరు. వాళ్ళకు స్వయంగా మాట్లాడే తీరికగానీ, యితరులు మాట్లాడితే వినే ఓపికగానీ వుండవు.

ఈ ప్రక్క వాటాలో చేరిన పడుచువాడు అలాంటి వాళ్ళల్లో ఒక్కడు కాకూడదు. అదే నీలకంఠం కోరిక.

"ఇదిగో పార్వతీ!" అన్నాడు నీలకంఠం. "ఏమండీ! పిలిచారా?" అంది పార్వతి.

"మనిషి ఎలా వుంటాడో చెప్పావు కావు..." ఎలా వుంటాడో తెలిస్తే ఎలాంటివాడో ఊహించుకో వచ్చునని నీలకంఠం ఆశ.

"మనిషికేం, తీర్చి దిద్దిన బొమ్మలా వున్నాడు. పెరట్లోకి వెళ్ళి స్నానం చేయడానికి ఉపక్రమించాడు బాబూ, చేద బావిలో నీటి మట్టం రెండడుగులు తగ్గింది. ఆ తరువాత నింపాదిగా టాయిలెట్ చేసుకుని గదిలో నుంచీ బయట పడడానికి ఎంత లేదన్నా అరగంట సేపు పట్టింది..."

"అలాగా!" సాలోచనగా తలపంకించాడు నీలకంఠం. బహుశా ఇతగా డెవరో పరీక్షలు ప్యాసై క్రొత్తగా ఉద్యోగ జీవితంలో ప్రవేశించిన వాడైవుంటాడు. బాహ్య స్వరూపం మీద అంతటి శ్రద్ధ మరెవరికుంటుంది?

నీలకంఠం భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళాడు. అయిదు గంటల దాకా ఫైళ్ళతో పోరాటం జరిపాడు. మిగిలిన ప్రొద్దును క్లబ్బులో పోగొట్టుకుని, మిత్రులతో షికారుకు వెళ్ళి బాగా చీకటిపడిన తర్వాత యింటిదారి పట్టాడు.

వీధి మెట్లెక్కుతూ నీలకంఠం గడియారం చూచుకున్నాడు. గంట తొమ్మిది కావస్తోంది. వరండాలో చెప్పులు విడుస్తూ ప్రక్క వాటాకేసి చూచాడు. గదిలో ఓ గుడ్డి దీపం వున్నా లేనట్టే మినుకు మినుకుమంటోంది. అతడు నాలుగడుగులు ముందుకు వేశాడు. మంచంపైన వెచ్చటి శాలువా పొరల క్రింద ఆ యువకుడు గుర్రు పెడ్తున్నాడు.

"ఓరి వీడిల్లు బంగారం గానూ!" - నీలకంఠం నివ్వెర పడిపోయాడు. ఆ నాటి సాయంత్రం శ్రోతలు వూపిరి బిగపట్టి నోళ్ళు బారగిల తెరుచుకోడానికి కావలసినంత ఆశ్చర్యాన్ని సరఫరాచేస్తూ ఆకాశవాణి కొన్ని వార్తలు ప్రసాదించింది. ఒక మంత్రిగారు రాజీనామా చేసేశారు. నీరెత్తిన నిమ్మలాంటి ఒక రాష్ట్రంలో హఠాత్తుగా ఉద్యోగు లందరూ సమ్మె కట్టేశారు. అగ్రరాజ్యాల అధినేతలు అనతికాలంలో ఒక టేబిల్ చుట్టూ కూర్చోబోతున్నారు. ఈ రాజకీయ విశేషాల సంగతి అలావుండగా పట్టణంలో లక్షలకు

లక్షలు మంచి నీళ్ళకు మల్లే వ్యయించి భారీ సెట్టింగులతో నిర్మించిన ఓ మహత్తర చలన చిత్రం విడుదలై థియేటరులో మొట్టమొదటి ఆట జరుగుతోంది. ఆ థియేటరు ఎదుట సాయంత్రం ఆరుగంటలప్పుడు సంఘటించిన జనాల తొక్కిడిలో ఒకరిద్దరు ప్రాణాలు పోక మునుపే ఆసుపత్రికీ, యిద్దరు ముగ్గురు ముష్టి యుద్ధంలో బలాబలాలు తేలక మునుపే పోలీసు స్టేషనుకూ వేంచేశారు. బయటి ప్రపంచంలో యింతటి అలజడి చెలరేగుతుండగా నరాల్లో వుడుకు నెత్తురు ప్రవహిస్తున్న ఓ యువకుడు యిలా నిర్లిప్తంగా మంచంపైన పడి గురకపెట్టడం కన్నా అసమంజసమైన విషయం మరొకటి ఉండబోదు. నాన్‌సెన్స్. యిదేదో ముడిసరుకులా వుంది. అయినా ఫరవాలేదు. ఈ ముడిసరుకులో నుంచీ మంచి శిల్పాన్ని తయారు చేయడం తన చేతనౌను.

ఆ రాత్రికి మాత్రం ఆ యువకుడి అజ్ఞానాన్ని ఓర్చుకుని, ఉదయం ఆరుగంటల కల్లా తలుపు దబదబా బాదేశాడు నీలకంఠం. అవతలి వ్యక్తి తలుపు తెరిచీ తెరవక ముందే "అదేమి టబ్బాయ్! సూర్యోదయం కాబోతుండగా యింకా నిద్రపోవడమే! అబ్బే, తప్పుకాదూ! లేలే, లేచి ముఖం కడుక్కో. అన్నట్టు ఏ వూరు, ఏం కథా? ఇక్కడేం చేస్తున్నావు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

"మా వూరా అండీ! ఇక్కడికి నలభైమైళ్ళ దూరంలో ఓ పల్లెటూరు. నాపేరు కృష్ణమూర్తి. సర్వే ఆఫీసులో ప్రస్తుతం జూనియర్ మోస్టు గుమాస్తాను నేనే!"

పెరట్లోకి వెళ్ళి దంతధావన ముఖ ప్రక్షాళనాదులు ముగించి, కృష్ణమూర్తి మళ్ళీ లోపలికి వచ్చేసరికి టేబిల్‌పైన వేడివేడిగా కాఫీ ప్రత్యక్షమైంది.

"అబ్బే, మీకు శ్రమెందుకండీ! నేను హోటలుకు వెళ్తాను" అన్నాడు కృష్ణమూర్తి.

"ఎందుకూ! నీకు తెలియదనుకో కృష్ణమూర్తీ! మా ఆవిడ కాఫీ ముందు హోటలు కాఫీ దిగదుడుపుకైనా పనికిరాదు..." బెదురు గొర్రెకు పచ్చిక చూపించి మచ్చిక చేసుకున్నట్టుగా నీలకంఠం కాఫీ కప్పును కృష్ణమూర్తి చేతికి అందించాడు. అతణ్ణి ప్రక్కన కూర్చోబెట్టుకుని, వున్న వూరు విడిచివచ్చి వుద్యోగంలో చేరి క్రొత్త పరిసరాల్లో మెలగవలసిన వాడికి బిడియం పనికిరాదనీ, పోగా కాస్త చొరవ గూడా అవసరమనీ హితోపదేశం చేశాడు. ఎంత ఉద్యోగమైనా అదే జీవితం కాదనీ, జీవితాన్ని ఆహ్లాదకరంగా వుంచుకోడానికి సంఘంతో కలిసి మెలిసి వుండడం అవసరమనీ, అందుకోసం ఆరోజు సాయంత్రమే క్లబ్బులో మెంబరుగా చేరమన్నాడు. ఎట్టివానికైనా సదసద్వివేకం కలిగించే వాటిల్లో సద్గ్రంథ పఠనం ఒకటి గనుక ప్రవేశ రుసుము చెల్లించి సెంట్రల్ లైబ్రరీ నుంచీ పుస్తకాలు తెచ్చుకోమన్నాడు.

* * *

తనపట్ల యింతగా అక్కర తీసుకుంటున్న నీలకంఠానికి ఎలా కృతజ్ఞత తెలుపుకోవాలో తెలియక కృష్ణమూర్తి వుక్కిరి బిక్కిరై పోయాడు.

అంతటితో వూరుకున్నాడు గాదు నీలకంఠం. "ఎందుకు చెబుతున్నా నంటే కృష్ణమూర్తీ, నువ్వు అమాయికుడిలా వున్నావు. ఈ పట్టణంలో మానవుడు వీలైనంత బిజీగా బ్రతకడానికి అలవాటు పడాలి. సోమరితనం దుర్వ్యసనాలకు దారితీస్తుంది. అదే సరేగానీ కృష్ణమూర్తీ, నువ్వు అసలే అబ్బినాకారపు మనిషివి. హోటలు తిండి నీకేం సరిపడుతుందోయ్! ఓ ముసలావిడను తెచ్చి పెట్టుకుంటే కమ్మగా వంటచేసి పెట్టేది గదూ!"

పెదవులపైన పొడచూపిన చెంపలపైకి ప్రాకిన చిరునవ్వు వెలుగులో నుంచీ కన్నెపడుచులా సిగ్గుపడిపోతూ "అనవసరం కదండీ! ఒకటి రెండు మాసాల్లో మా ఆవిడ కాపురానికి రాబోతోంది..." అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమిటేమిటీ! నువ్వసాధ్యుడివోయ్ కృష్ణమూర్తీ! అలాగైతే నీకు పెళ్ళయిందనమాట! విన్నావా పార్వతీ, అబ్బాయికి పెళ్ళయిందట! చూడు కృష్ణమూర్తీ, పలుకు దోడులేక మా ఆవిడకు బొత్తిగా ప్రొద్దేపోవడం లేదనుకో! నువ్వు వీలైనంత త్వరగా మీ ఆవిడను తీసుకొచ్చి కొత్తకాపురం ప్రారంభించాలి..."

బాతాఖానీ మరికొంత సేపు కొనసాగిన తర్వాత ఆఫీసులో తొందర పనులున్నాయని చెప్పి కృష్ణమూర్తి సెలవు తీసుకున్నాడు. ఆ తరువాత పది పదిహేను నిమిషాల వరకూ అలాగే మౌనంగా కూర్చుండి పోయి, నీలకంఠం హఠాత్తుగా ఓ సందేహం వెలిబుచ్చాడు.

"ఇతడేమో నోటిలో నాలకు లేనివాడు పార్వతీ! ఆ పెళ్ళాం ఎలాంటిదో మరి! రౌతుకొద్దీ గుర్రం కదా! తీరా ఆవిడ మూడు కాళ్ళతోనే నడుస్తుందేమో!"

"ఏమిటండీ! ఏమన్నారు? ఈసారి చెప్పండి..." చేస్తున్న పనిని విడిచిపెట్టి బాణంలా భర్తను సమీపించింది పార్వతి.

నీలకంఠం నాలుక కొరుక్కున్నాడు. ఎంత జాగ్రత్త పడితేనేమి అప్పుడప్పుడూ ఇలా నోరు జారడం, అందుకు ఫలితంగా పార్వతి నాలుగు దులుపులు దులపరించడం ఈ కాపురంలో ఆదినుంచీ వస్తున్న రివాజు. సంసారంలో భార్యాభర్తల స్థానాన్ని గురించి పార్వతికి కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు కద్దు. ఆలూ మగళ్ళకు జోడు గుర్రాల పోలిక ఒకటి తప్పితే, పువ్వూ తావీ, మేనూ నీడా, శబ్దమూ భావమూ లాంటి ఉపమానాలను ఆమె సహించదు. ఇక 'గుర్రమూ, రౌతూ ఉపమానమా!" హరేరాం. ఈ రోజు తను నిద్రలేచిన వేళ చెడ్డది.

◆ ◆ ◆

తల్లికి అనారోగ్యంగా వుందని జాబురాగా పార్వతి పుట్టింటికి వెళ్ళవలసి వచ్చింది. ఆ అనారోగ్యం నానాటికీ విషమించినందువల్ల ఒకటి రెండు మాసాలు తిరిగి రావడానికి వీల్లేకపోయింది. వీలు కలుగ జేసుకుని నీలకంఠం నాలుగు రోజులు సెలవులో అత్తగారిని చూచి రావడానికి వెళ్ళాడు.

మామూలు కుశల ప్రశ్నలన్నీ ముగిసిన తర్వాత "ఏమండీ! కృష్ణమూర్తి పెళ్ళాన్ని తీసుకొచ్చేశాడా!" అంది పార్వతి.

"ఇంకానా! ఎప్పుడో తీసుకొచ్చేశాడే" అన్నాడు నీలకంఠం ఈజీ చేర్‌లోకి వ్రాలిపోతూ.

"అమ్మాయి మంచిదేనటండీ!"

నీలకంఠం తటాలున లేచి నిటారుగా కూర్చున్నాడు. "మంచిదా! మెల్లగా అడుగుతున్నావా ఆమాట! నారీ జగత్తుకే అలంకార ప్రాయమనుకోరాదా పార్వతీ! ఏం వినయం, ఏం విధేయత! అంతెందుకూ, కాపురాని కొచ్చి నెలరోజులైంది గదా, ఆమె పల్లెత్తి పలకరించగా నేను విన్లేదంటే మరేమనుకోవాలి..."

పరిస్థితి ఏమంత ఆశావహంగా లేనట్టు ముఖం అదోరకంగా పెట్టి "ఇదేమిటో విడ్డూరంగానే వుంది మరి" అంది పార్వతి.

నీలకంఠం పని అడుసులో బారెడు లోతుకు దిగబడినట్టయింది. పైకి రావడానికి గింజుకుంటున్నట్టుగా అతడు "అలాగంటే నేనొప్పుకోను పార్వతీ! నువ్వ వెయ్యి చెప్పు. లక్షచెప్పు, అమ్మాయి మణిపూస. కావలిస్తే ఎన్ని ఉదాహరణలైనా చెబుతాను. మొన్ననేం జరిగిందో తెలుసా? జీతం రాగానే కృష్ణమూర్తి ఓ చీర కొనుక్కొచ్చాడు. 'నేను మా యింటి దగ్గర నుంచీ బోలెడు చీరలు తెచ్చుకుంటే మళ్ళీ యిదెందుకండీ! వద్దొద్దు' అని ఆ చీరను వాపసు చేసేంతవరకూ ఒంటి కాలిపైన నిలిచింది..."

"ఇకనేం! మీరెంతగా దాచిపెట్టబోయినా ఆవిడగారి మంకుతనం బయట పడిపోతూనే ఉంది" అంది పార్వతి.

ఆవేశాల్ని హద్దులో వుంచుకోడానికి అలవాటు పడిన నీలకంఠం, తన కోపాన్ని గూడా వీలైనంత సరళంగా మాటల్లోకి అనువదించడానికి ప్రయత్నించాడు. "నాగరికత అన్న పేరు మీదుగా సంప్రదాయాలన్నీ మట్టిగొట్టుక పోగా, కుక్కమూతి పిందెలాంటి అభిరుచులతో సతమమౌతున్న వాళ్ళకు మంచే చెడ్డగా కనిపించవచ్చు పార్వతీ. కానీ దగ్గర నుండీ చూస్తే నీకే తెలుస్తుంది. భర్త రాత్రి తొమ్మిదింటికి రానీ, లేకుంటే మొదటి సినిమా చూచుకుని పది గంటలకు రానీ, అతడువచ్చి భోజనము చేసేదాకా ఆమె అన్నం ముట్టదంటే నువ్విప్పుడు నమ్మవు. తెల్లవారు జామున నాలుగు గంటలకే లేచి, స్వయంగా

అన్ని పనులూ పూర్తిచేసి భర్తలేచేసరికి ఫ్లాస్కులో కాఫీపోసి రెడిగా ఉంచుతుందంటే నువ్విప్పుడు నమ్మవు. ఇన్నిమాటలెందుకు పార్వతీ! 'గృహిణి' అన్నపదం ఆమెపట్ల సార్థకం..."

పార్వతి ఆలోచనలో పడింది. ఐనా ఆడదానికింత మంచితనం తగదు. క్రమ క్రమంగా భార్యభర్త దృష్టిలో అలుసైపోయి, చాకిరీ చేయడం కోసం వుద్దేశింపబడిన యంత్రంగా భాసించడానికి తప్పితే ఈ మంచితనం మరొకందుకు పనికిరాదు. భార్య సాన్నిధ్యం భర్తకు తీయటి పానకం లాంటిదైతే గావచ్చు. కానీ ఆ పానకానికి ఘాటుగా మిరియాలపొడి తగలడం అత్యవసరం.

"వట్టి పానకం ఒంటికి చెరుపు. కాబట్టి చెల్లెలా! కాస్తా మిరియప్పొడి కలుపు..." అని పార్వతి ఓ సలహాను అప్పటికప్పుడే తయారుచేసింది.

◆ ◆ ◆

కాలచక్రం కదలికలో మళ్ళీ ఒకటి రెండు ఆకులు క్రిందికి వెళ్లాయి. ఈ ఒకటి రెండు మాసాల వ్యవధిలో నీలకంఠం లెక్క ప్రకారం రాజకీయ సాంస్కృతిక రంగాల్లో మననం చేసుకోదగ్గ సంఘటనలు చాలాజరిగాయి. కానీ కృష్ణమూర్తి దాంపత్య జీవితం దృష్ట్యా చెప్పుకోదగ్గ సంఘటన తల్లికి స్వస్థత చేకూరిన తర్వాత పార్వతి పుట్టింటి నుంచీ తిరిగి రావడం ఒక్కటి మాత్రమే. ఆమె రాకపోయినట్టయితే- వచ్చినా తన పాత్రను సక్రమంగా నిర్వర్తించడంలో వెనుకాడి వుండినట్టయితే ఈ కథ ఎదుగూ, బొదుగూ లేకుండా సామెతలో గొంగడిలా పరిణమించి వుండేది.

ఓ రోజు రాత్రి తొలిజాము గడిచింది. పుచ్చపువ్వులాంటి వెన్నెల. పెరట్లో మంచం వాల్చుకుని నీలకంఠం పొరుగింటి నుంచీ వినిపిస్తున్న రేడియో సంగీతం వింటున్నాడు. పార్వతి పళ్ళెంలో తమలపాకులు తీసుకొచ్చి భర్తకు దగ్గరగా కూర్చుని తాంబూల సేవనానికి ఉపక్రమించింది.

"ఏమిటి పార్వతీ! కృష్ణమూర్తి కనిపించలేదే!" అన్నాడు నీలకంఠం.

"లోగిట్లో వుంటే గదండీ కనిపించడానికి! అబ్బాయి మాత్రమేం చేస్తాడు పాపం! ఆఫీసు నుంచి యింటికి వచ్చే దారిలో వీధివీధికి థియేటరేనాయె! వాటి బారినుంచి తప్పించుకుందామనుకుంటే స్నేహితులు వుండనే వుండిరాయె! త్వరగా ఇంటికి రావడమంటే మాటలా?"

"పోనీలే పార్వతీ! ఏదో కుర్రాడు. కాలూ చేయీ ఆడకపోతే కాలమే

ఆగిపోయినట్లుంటుంది. నాలుగుచోట్లకు వెళ్ళి నాలుగు దృశ్యాలు చూడవలసిన వయసు గదా!"

"ఔనౌను, నిజమేనండీ బాబూ, నిజమే! కానీ వయసులో సుశీల అతడికంటే పెద్దదేం కాదుగదా! మూసిన కిటికీకి, వేసిన తలుపుకూ వెనుక ఆవిడకు మాత్రం కాలం జోరుగా పరుగిడుతుందేమో!"

ఆ వాగ్వాదం అలా ఎంతదూరం సాగిపోయేదో గానీ యింతలో వీధి తలుపు తెరుచుకుంది. కృష్ణమూర్తి బూట్ల చప్పుడుతో చరచరా లోపలికి వచ్చేశాడు.

ఆ పాదరక్షల టకటకలు సుశీలకు బాగా గుర్తు. ఆ శబ్దం ఆమెకు భర్త వీధి మెట్లెక్కుతుండగానే వినిపించేది. కానయితే ఈ దఫా ఆ చప్పుడు వీధి మెట్లపైన గాదు సరిగదా, సరాసరి ద్వారం దగ్గిరకే వచ్చి ఆగినా సుశీలకు విన్పించలేదు! కృష్ణమూర్తి తలుపు పైన చిటికెలు వేసి చూచాడు. పిలిచి చూచాడు. అరవను గూడా అరిచాడు.

అఖరుకు విసుగెత్తి "యింత మొద్దు నిద్రయితే ఎలాగండీ మేష్టరు గారూ!" అని నీలకంఠంతో చెప్పుకుని వాపోయాడు.

"ఏం చేద్దాం నాయనా! కాసేపు వేచి చూద్దాం. ఇంకొక అర గంట కయినా లేవక పోతుందా?" అంటూ కృష్ణమూర్తిని సముదాయించింది పార్వతి.

"ఏమో, అప్పటికి మాత్రం లేస్తుందని నమ్మకమేమిటి?" అనుకున్నాడు నీలకంఠం.

కానీ సుశీల ఎంతసేపటికి వరకూ నిద్రపోతుందో, ఎప్పుడు లేస్తుందో నన్న విషయం పట్ల పార్వతికున్న పరిజ్ఞానాన్ని నీలకంఠం శంకించడానికి వీల్లేకపోయింది. ఎందుకంటే, ఓ అరగంట గడచిన తర్వాత, ఆమె లేచి వెళ్ళి ద్వారం దగ్గర నిల్చుని "సుశీ! సుశీ!' అని ఒకటి రెండుసార్లు పిలవగానే ఆలీబాబా మంత్ర ప్రభావానికి లోనయిన గుహాకవాటంలో తలుపు యిట్టే తెరుచుకుంది.

నీలకంఠానికి సరిగ్గా నిద్రపట్టింది గాదు. ప్రతిపక్షం చేతిలో చిత్తు చిత్తుగా ఓడిపోయిన అవమానంలాంటి దేదో అతడి మనసులో వుండి వుండి రగులుకోసాగింది. 'కీ' యిచ్చి పట్టాలపైన విడిచిన బొమ్మ రైలు క్రింద పడిపోగా పిల్లవాడికి కలిగే ఖేదంలాంటి దేదో అతడి మనసులో పరవళ్ళు త్రొక్కింది.

ఆ మరునాటి సాయంకాలం అయిదు గంటలకు ఆఫీసు నుంచి బయటపడి ద్విచక్ర శకటారూఢుడై గృహోన్ముఖుడయిన నీలకంఠానికి మార్గమధ్యంలో తల వంచుకుని పేవ్‌మెంటుపైన నీరసంగా నడిచి వస్తున్న కృష్ణమూర్తి కన్పించాడు.

"ఏమిటయ్యా కృష్ణమూర్తీ! ఎందుకయినా మంచిదని అరగంట పర్మిషన్ పెట్టి ఈ

రోజు కాస్తా ముందుగానే బయల్దేరేశా వేమిటి?" అంటూ నిలకంఠం కృష్ణమూర్తిని పలకరించాడు.

కృష్ణమూర్తి ఫక్కున నవ్వేశాడు. నవ్వి "ఏడవలేక నవ్వుతున్నానండీ మేష్టరుగారూ! సంసారం సాగరం దుఃఖం అన్నారు. ఆ మాట నిజమే కావచ్చు ననిపిస్తోంది" అన్నాడు.

నీలకంఠం గ్రుచ్చి గ్రుచ్చి అడిగాడు. సినిమాకు తీసుకెళ్ళలేదని కోపమా? లేక కేవలం ప్రణయ కలహమా? అసలు సంగతేమిటి? ఎన్నాళ్ళనుంచీ ఈ వైమనస్యం పుట్టి పెరుగుతోంది? కారణం లేనిదే కార్యం లేదుగదా! మరి, ఏం తప్పిదం జరిగిందని ఈ ప్రతీకారం?

"జాబితా చిన్నదేం కాదండీ మేష్టరుగారూ!" వేడి నిట్టూర్పుతో ప్రారంభించాడు కృష్ణమూర్తి.

"కారణాలు పెక్కులు. ఒకటి, నేను ప్రతినెలా పాతిక రూపాయలు మిగిలించి యింటికి పంపుతున్నాను. ఇక పైన అలాటి తెలివి తక్కువ పని చేయకుండా ఆ డబ్బును మిగిలించి యింక ఆరుమాసాల్లో తనకో నగ చేసిపెట్టాలి. రెండు, వాయిదాల లెక్కలో డబ్బు చెల్లించే ఏర్పాటుతో తక్షణం ఓ రేడియో తెచ్చి యింట్లో నెలకొల్పాలి. మూడు, సినిమాలకు వెళ్తే ఉభయులమూ కలిసే వెళ్ళాలి. లేకుంటే ఎవరూ వెళ్ళగూడదు. నాలుగు, రెండు నెలల కోసారి తను పుట్టింటికి వెళ్ళడమో, లేక వాళ్ళెవరయినా యిక్కడికి వచ్చేటట్లు చూడడమో విధిగా జరిగి తీరాలి..."

నీలకంఠం పెదవి విరిచి అడ్డదిడ్డంగా తలాడించాడు. జరగగూడని పనేదో జరిగిపోతున్నట్టు నుదురు చిట్లించి, కణతలను చేతి వ్రేళ్ళతో రుద్దుకున్నాడు. చెప్పడానికి బొత్తిగా యిష్టం లేకపోయినా తప్పనిసరిగా చెప్పవలసి వస్తున్నందుకు క్షమాపణ ధ్వనిస్తున్న గొంతుకతో "ఒక్కమాట చెప్పమంటావా కృష్ణమూర్తీ!" అన్నాడు.

"అనుభవం లేనివాణ్ణి మేష్టరుగారూ! మీరు చెప్పనూ వచ్చు, నేను విననూ వినొచ్చు. చెప్పండి" అన్నాడు కృష్ణమూర్తి.

"సంసారమన్న తర్వాత భార్యాభర్తల్లో ఎవరో ఒకరు, మరొకరు చెప్పినమాట వినక తప్పదు. కానీ ఎవరి మాట ఎవరు వినాలన్నదే ఇక్కడ చిక్కు ప్రశ్న. సంసారంలో నోటి దురుసుతనమూ, వేగిరపాటూ, మంకుపట్టు వీటిదే పైచేయి అయిననాడు యిక ఆ సంసారం గతి అధోగతే! నన్నడిగితే ఎవరు బుద్ధిమంతులయితే వాళ్ళమాటే సాగాలంటాను. నువ్వు బుద్ధిమంతుడివన్న సంగతేమో నేనేనాడో చెప్పేశాను. నీ పరిస్థితులు నీకు తెలుసు. నిన్నగాక మొన్ననే వచ్చింది గనుక ఆమె కప్పుడే నీ బాగోగులు తెలిసివచ్చి వుంటాయని

నే ననుకోను. తెలియనప్పుడు తెలియనట్టే పడివుండడం మంచిది. లేకుంటే అందుకు తగిన చర్య తీసుకోవడం సబబు. ఇదంతా ఏండ్లుగా, పూండ్లుగా ఆలోచించి, నేను కనిపెట్టిన పరమరహస్య మేమీ కాదు. ఆలోచిస్తే నీకైనా తెలిసేదే! ఆలోచించు, బాగా లోతుగా ఆలోచించు..."

కృష్ణమూర్తి ఆలోచించాడో లేదో మనకు తెలియదు. బహుశా ఆలోచించి వుండడు. ఆ మాటకొస్తే అతనికి స్వయంగా ఆలోచించుకునే అవకాశం ఎవరిచ్చారు గనుక. అబ్బో, ఈ లోకుల సహృదయత ఎంత గొప్పది! వీళ్ళు తమను గురించి తాము ఆలోచించి చేయదగిందేమీ లేదని తెలిసి రాగానే, యితరుల్ని గురించి ఎడతెరిపి లేకుండా ఆలోచిస్తారు. తమ సంసారాల్ని చక్కబరచుకునే వెరవు లేనప్పుడు ఇతరుల సంసారాల్ని చక్కబరచడానికి శాయశక్తులా తంటాలుపడుతారు.

ఆఖరుకు ఎలాగైతేనేం ప్రచ్ఛన్న యుద్ధంలో నీలకంఠం జయించాడు. అతడి విజయం ఓరోజు మునిమాపు సమయాన కృష్ణమూర్తి చేయి చేసుకున్నందుకు ఫలితంగా సుశీల కార్చిన కన్నీళ్ళద్వారా, వెక్కి వెక్కి ఏడ్చిన ఏడుపుద్వారా బయటికి వ్యక్తమైంది.

♦ ♦ ♦

ఒక్కొక్కప్పుడు పార్వతి వుడుకుమోత్తనం చూడ చూడ ముచ్చటగా వుంటుంది నీలకంఠానికి. దీప దీపాల వేళ సుశీల కంట కన్నీరొలికిన నాటినుంచీ ఆ వుడుకుమోత్తనం మరింత నేత్రానందకరంగా వుందతనికి! అంతేగాదు- వంట గదిలో పాత్రలూ, గిన్నెలూ, అకారణంగా ఒకదానికొకటి ఢీకొంటున్న మ్రోత అతనికి వీణాగానంలా కర్ణపర్వంగా వుంది. క్షారోదకంలాంటి కూరలు, మిరపకాయ వుండలా మంట కపాలానికెక్కే శాకపాకాలు అతనికి వీలైనంత రుచ్యంగానే వున్నాయి. అవును మరి! విజయోత్సాహం అలాంటిది, రాజ్యాలు గెల్చిన సంబరంలో దేశాధిపతులు చెరసాల తలుపులు బారగిల తెరచి దుండగీళ్ళను బయటికి వదిలేశేవారంటే యిక నీలకంఠం సూటిగా తనపైన విరుచుకపడలేక పార్వతి చేస్తున్న యిలాంటి చిన్న చిన్న తప్పిదాల్ని పట్టించుకోకపోవడంలో ఆశ్చర్యమేముంది?

కానీ నీలకంఠానికి లోలోపల ఒక భయం లేకపోలేదు. మొదట పార్వతి పుట్టి, తరువాత పట్టుదల పుట్టింది. అనువుగానివేళ పెదవి కదపకుండా మూకీభావం వహించినా సమయం వచ్చినప్పుడు ఆమె ఎదురుదెబ్బ తీయడానికి వెనుదీయదు. కానీ ఈ చదరంగపుటాటలో నిస్సందేహంగా తన బలం గొప్పది. పార్వతి ఎన్ని యెత్తులు వేసినా

చివరకు గెలుపు మాత్రం తనదే.

పదిపదిహేను రోజులు నీలకంఠానికి నిశ్చింతగా గడిచిపోయాయి. కానీ కాలం ఒక్క తీరుగా గడవదనడానికి నిదర్శనంగా ఓరోజు సాయంకాలం నీలకంఠం యిల్లు చేరుకునేసరికి పార్వతి ముఖం విచ్చిన తమ్మిపువ్వులా కలకలలాడుతూ ప్రత్యక్షమైంది. ఈ హఠాత్పరిణామానికి కారణమేమిటో తెలియక అతడు వరుసగా విస్తుబోయి, తెల్లబోయి, తబ్బిబ్బులు పడిపోయాడు.

కానీ ఈ ఆందోళనమంతా ఒకటి రెండు నిమిషాలు మాత్రమే. పార్వతి ముఖమండలంపైనుంచే చూపులు మళ్ళించి పక్కవాటాకేసి చూడగానే నీలకంఠానికి అసలు విషయం లీలగా అవగతమైపోయింది.

"పార్వతీ! అమ్మాయి ఏదీ? తలుపుకు తాళం బిగించి ఎక్కడికి వెళ్ళినట్టు?" అన్నాడు నీలకంఠం.

"పుట్టింట్లో ఎవరికో జబ్బుగా వున్నట్టు జాబొచ్చింది గదండీ! సుశీల మధ్యాహ్నం రెండు గంటల బండికి వెళ్ళింది. ఆ అలమారులో చూడండి- తాళం చెవి కనిపిస్తుంది. అన్నట్టు నేనిక్కడ నా గొడవలో వున్నాను గానీ. మీ స్నేహితుడురాగానే ఆ తాళం చెవి కాస్తా యిచ్చేస్తారు గదూ!"

తన నెవరో దూదిపింజకన్నా తేలికగా చేసి ఉఫ్‌మని గాలిలోకి వూదినట్టు నీలకంఠం కింద పడిపోయాడు. ఇలాంటిదేదో జరుగవచ్చునన్న అనుమానమైతే తనకు లేకపోలేదుగానీ, అది యింత త్వరగా ఈవిధంగా జరుగుతుందని మాత్రం అనుకోలేదు. ఐనా యింతటి సాహసమా? కాదు. సాహసం అనడానికన్నా దీన్ని తెంపరితనం అనడమే సమంజసం.

ఐనా నీలకంఠం యిదీ ఒకందుకు మంచిదే ననుకున్నాడు. తనమాట లేకుండా భార్య పుట్టింటికి వెళ్తే అగ్గిమీద గుగ్గిలంలా మండిపడని భర్త ఎవడుంటాడు? ఇది కృష్ణమూర్తి కోపాన్ని కావేషంగా మార్చగలిగిన సంఘటన. తలదిరిగి కబళం నోటిదగ్గరికి వచ్చేదాకా కృష్ణమూర్తి ఈ కావేషాన్ని పదిలంగా వుంచుకోగలిగితే అటువైపు మనుషులకు తిక్క కుదురుతుంది.

ఐతే నీలకంఠం అంచనా కొద్దిగా తారుమారైంది. అగ్గిమీద గుగ్గిలంలా మండిపడకపోవడం అటుండగా, విషయం తెలియగానే కృష్ణమూర్తి గబాలున ఏడుపు ముఖం పెట్టి దిగాలుపడిపోయాడు.

"చూచారా మేష్టరూగారూ! ఎంత పనిచేసిందో చూచారా? నేనిప్పుడు వెళ్ళి రావడానికి వీల్లేదన్నమాట నిజమే. ఐతే మాత్రం మనిషికి పట్టువిడుపులుండొద్దూ! ఆకాడికీ ఓవైపున సెలవు కోసం ప్రయత్నిస్తూనే వున్నాను. ఆఫీసరుగారు పైవారం చూద్దాం కానిమ్మన్నారు. ఇంతలోపల ఏంపుట్టిమునిగి పోయేదో చెప్పండి. అక్కడ మనుషులు లేరూ? డాక్టర్లు లేరూ?"

నీలకంఠం కృష్ణమూర్తి భుజంపైన చేయివేసి, అతడి కళ్ళల్లోకి సూటిగా జూస్తూ "యింత మాత్రానికే బెంబేలు పడిపోతే యెలా కృష్ణమూర్తీ. బ్రతుకు బాట తారురోడ్డు గాదు. ఎన్నో మిట్టపల్లాలు, మరెన్నో వంకర టింకరలు వుండకపోవు. దేనికీ జంకకుండా నిశ్చలంగా నిలబడగలగాలి. అలా కాకుండా దారిప్రక్కన చెట్లో వుడత కితకిచలాడితే భయపడి పరుగు లంకించుకునే వాడికి బ్రతకడంకంటే బాధాకరమైన విషయం మరొకటి వుండదు." అన్నాడు.

ఆ ఓదార్పు కొంతవరకు పనిచేసినట్టే కనిపించింది, కృష్ణమూర్తి మౌనంగా గదిలోపలికి వెళ్ళిపోయాడు.

మరునాటి వుదయం మామూలు మేరకు కృష్ణమూర్తి ఆఫీసుకు వెళ్ళాడు. సాయంత్రం కాగానే క్లబ్బులో నీలకంఠాన్ని కలుసుకున్నాడు. ఇద్దరూ సినిమాకు బయల్దేరారు. హోటలు కళ్యాణిలో ఉపాహారం తీసుకుని క్యూలో నిల్చుని టిక్కెట్లు కొనుక్కుని థియేటరులో ప్రవేశించారు. నీలకంఠము వాగ్ధోరణి కడ్డంగా దీపాలారిపోయి, వెండితెరపైన బొమ్మలాట ప్రారంభమైంది.

కథలో లీనమైపోయి ఓ హాస్య సన్నివేశంలో కడుపుబ్బ నవ్వుతూ నీలకంఠం కృష్ణమూర్తివైపు చూచేంత వరకూ అతడు గూడా శ్రద్ధగా సినిమా చూస్తున్నట్టే భావించాడు. చీకటిలో సరిగ్గా చూస్తున్నాడో లేదో తెలియడం లేదు గానీ ఒకటి మాత్రం నిజం- అతడు నవ్వడం లేదు.

"ఎక్కడున్నావు కృష్ణమూర్తీ. నవ్వగూడదని దీక్ష పట్టేశావేమిటి?" అన్నాడు నీలకంఠం.

"నవ్వడమా! ఎందుకండీ మేష్టరుగారూ! అరరే, చాలామంది నవ్వుతున్నట్టున్నారే." అంటూ కృష్ణమూర్తి బిక్కముఖం పెట్టేశాడు.

నీలకంఠానికి చిర్రెత్తుకొచ్చింది. ఈ రబ్బరు తిత్తికి ఎప్పుడు ఎక్కడ చిల్లిపడుతుందో వూహించడం కష్టం. పడినప్పుడల్లా తమ సొల్యూషన్ తెచ్చి అతకు వేస్తుండాలి. అతుకువేసి, గాలి పూరించి పైకి వదిలితే దాని భోగం మళ్ళీ కొంతసేపు మాత్రమే. అబ్బే- లాభంలేదు. ఈ రబ్బరు తిత్తిలో గాలి నిలవదు, నిలుస్తుందనుకోవడం తన భ్రమ.

* * *

కృష్ణమూర్తి మూలంగా నీలకంఠం నిరూపించ దలచుకున్న 'మగవాడి ఆధిక్యం' అదొక పేకమేడలా కూలిపోవడమైతే ఆ క్షణాన్నే ప్రారంభమైందిగానీ, అతడు పూర్తిగా హతాశుడు గావడానికి మాత్రం మరికొంత కాలం పట్టింది.

ఈ మరికొంత కాలంలో మానవుడు కృష్ణమూర్తి దిన దినానికీ ఒక రకంగా మారిపోతూ వచ్చాడు. వేసుకున్న దుస్తులు అవి మాసినా సరే, నలిగినా సరే తీసేయడం మానుకున్నాడు, దువ్వుకోకుండా తలను, మాసిపోయిన గడ్డాన్నీ యధేచ్ఛగా వదిలేశాడు. పరధ్యానంలో స్నానం పానం, భోజనంలాంటి ప్రాణావసర విషయాలను గూడా మరచిపోవడానికి అలవాటు పడ్డాడు.

వైద్యుడు బుద్ధిమంతుడైతే రోగం తన చేయి దాటుకున్న తర్వాత మందు లివ్వటం మానేస్తాడు. కానీ నీలకంఠం తాను గీసిన గిరిలోనుంచీ కృష్ణమూర్తి వైదొలగవచ్చు నన్న అనుమానం కలగగానే డోసేజీ హెచ్చించి అదేపనిగా మందులు కలపసాగాడు.

నిభాయించుకోలేకపోయాడు కృష్ణమూర్తి. ఈ శ్రేయోభిలాషి బారి నుంచీ తప్పించుకొడానికని అతడు రాత్రి పదకొండు పన్నెండు గంటలలకు గానీ యింటి ముఖం చూచేవాడు గాదు. ఉదయం నీలకంఠం నిద్రలేచేసరికే మళ్ళీ పరారై పోయేవాడు. కాని ఎంతోకాలం అతనిలా తప్పించుకుని తిరగలేక పోయాడు. ఓరోజు రాత్రి అతడు తప్పనిసరిగా కాస్త త్వరగానే యిల్లు చేరుకోవలసి వచ్చింది. నిద్రలేక కళ్ళు మండుతున్నాయి. తల నొప్పిగా వుంది. కాళ్ళు గాలిలో తేలిపోతున్నాయి. తాళము తీసి, తలుపు తెరచి, వాడిపోయిన తోటకూర కాడలా మంచంపైన కూలిపోయాడు.

వెంటనే సుడిగాలిలా లోపలికి జొరబడ్డాడు నీలకంఠం. "చూశావా కృష్ణమూర్తీ! సహారా ఎడారిలో బాంబులు ప్రేలబోతున్నాయట! ఇక నాలుగైదేళ్ళలో మానవుడు చంద్రగోళంలో మకాం పెట్టబోతున్నాడట! వంట చెరకుతో అవసరం లేకుండా సూర్యరశ్మి సాయంతో వంట చేసుకోవడం సాధ్యమేనట..." అంటూ తనకు ముఖ్యమని తోచిన విషయాలని ముదలకించుకున్నాడు.

విన్నంతసేపూ విని ప్రసంగం మధ్యలో కృష్ణమూర్తి చేతులు జోడించేశాడు. "మన్నించండి మేష్టరుగారూ! నేను సామాన్య మానవుణ్ణి, మానవుడు చంద్రలోకంలో మకాం పెట్టడంకన్నా నేను నా యింట్లో నెమ్మదిగా వుండడమే నాకు ముఖ్యం. లోకం ఏమైందో, ఏమి కానున్నదో తెలుసుకోవడంకన్నా నాకు నా బ్రతుకు తిన్నగా గడవడమే ముఖ్యం. దయచేసి మీరు వూరుకుంటే నేను నిద్రపోవడానికి ప్రయత్నిస్తాను" అంటూ గట్టిగా దుప్పటి కప్పుకున్నాడు.

◆ ◆ ◆

ఇతరుల హితోపదేశాలను పెడచెవిబెట్టి కృష్ణమూర్తి స్వయంగా ఆలోచించడానికి మొదలెట్టాడని చెబితే చాలు, ఈ కథ పూర్తయినట్టే. కానీ స్వయంగా ఆలోచించి ఏం చేశాడన్న ప్రశ్నకు జవాబుగా ఒకటి రెండు మాటలు– అద్దె కొంచెం ఎక్కువైనా ఫరవాలేదని అతడు వాటాలు గీటాలు లేకుండా ప్రత్యేకంగా వున్న ఓ యింటికి కాపురం మార్చేశాడు. అత్తగారింటికి వెళ్ళి సుశీలను పిలుచుకొచ్చేశాడు. ఆ తరువాత భార్యా భర్తల మధ్య అభిప్రాయభేదాలు కలగలేదని కాదు; కలిగాయి, కానీ వాళ్ళల్లో వాళ్ళే సర్దుకునేవాళ్ళు. నిజానికి సర్దుబాటువల్ల సాధ్యమయ్యేదే గదా సహజీవనం!

(... కమ్మ తెమ్మెర, 1968)

❀ ❀ ❀